

## కేసీఆర్, కోదండరామ్ కళ్లు తెరవాలి

- ఏదిక్కు చూసుకుని మహబూబ్‌నగర్‌లో పోటీ చేశారు?
- మూడు పర్యాయాలు గెలిచినా కరీంనగర్ ఎందుకు వదులుకున్నారు?
- జేపీసీలో చేరాలంటూ మా ఇంటి చుట్టూ తిరగలేదా!
- చంద్రశేఖర్‌కు ఎర్రబెల్లి చురకలు

హైదరాబాద్, మేజర్‌న్యూస్ : గోదావరి నదిపై బాబ్లీ వద్ద మహారాష్ట్ర అక్రమంగా 13 ప్రాజెక్టులు కడుతుంటే టీఆర్ఎస్ అధ్యక్షుడు కేసిఆర్ ఎక్కడున్నారు? కేంద్రం బీడీ కట్టలపై పుర్రెగుర్తు తీసుకువస్తుంటే కార్మిక మంత్రిగా ఉండి కేసిఆర్ గుడ్డిగా సంతకం పెట్టలేదా? అప్పుడు వీరికి తెలంగాణ గానీ, ఈ ప్రాంత ప్రజలకు గానీ కనిపించలేదా? అని టీడీపీ సీనియర్ నేత యర్రబెల్లి దయాకరరావు మండిపడ్డారు. ఈ రెండు అంశాలపై జాతీయ స్థాయిలో పోరాటం చేసింది తెలుగుదేశం పార్టీయేనని ఆయన చెప్పుకొచ్చారు. మంగళవారం టిడిఎల్పీలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణాపై ఏకాభిప్రాయ సాధన కుదరాలని ప్రధాని మన్మోహన్ మరో సారి మోసం చేస్తున్నారని, ఇప్పటికైనా కేసిఆర్, కోదండరామ్‌లు కళ్లు తెరవాలని హితవు పలికారు. మన లక్ష్యం కాంగ్రెస్ పార్టీయేనని ఆపార్టీని విడిచిపెట్టి తమపై ఎదురుదాడికి దిగడమేంటని యర్రబెల్లి ప్రశ్నించారు. టీడీపీ దిక్కుమాలినపార్టీ అంటూ కేసిఆర్ శాపనార్థాలు పెట్టడాన్ని యర్రబెల్లి తిప్పికొట్టారు. మూడు పర్యాయాలు గెలిచిన కరీంనగర్‌ను కాదని, ఏ దిక్కు చూసుకుని మహబూబ్‌నగర్‌లో ఎంపీగా పోటీచేశారని నిలదీశారు. మా పార్టీ సహకారంతో గెలుపొంది తిరిగి తమనే దూషిస్తారా? అంటూ మండిపడ్డారు. తెలంగాణాలో బలంగా ఉన్న తమ పార్టీని చూసి జెఏసీలో చేరాలని కేసిఆర్, కోదండరామ్‌లు తమ ఇంటి చుట్టూ తిరిగారో లేదో ప్రజలకు చెప్పాలని నిలదీశారు. ఆమాటకు వస్తే మొన్నటి అసెంబ్లీ ఎన్నికల్లో తెలంగాణాలో తమ పార్టీ 59 స్థానాల్లో పోటీ చేసి 38 స్థానాల్లో గెలుపొందిందని, పొత్తులో భాగంగా టిఆర్ఎస్‌కు 45 సీట్లిస్తే పట్టుమని పది కూడా గెలువలేదని ఎవరిది దిక్కుమాలినపార్టీనో ప్రజలకు తెలుసని చురకలు వేశారు.



## శ్రీకృష్ణ కమిటీకి

# వాస్తవాలు తెలియజేస్తా

- అవకాశం దొరికితే సోనియాతో ప్రత్యేక భేటీ
- 25 లక్షల సభ్యత్వం పూర్తి
- కొన్ని నియోజకవర్గాల్లో సభ్యత్వం జరగలేదు
- 11, 12 తేదీల్లో పీసీసీ అధ్యక్షుల సమావేశం
- హస్తినకు డీఎస్ ● 13న తిరిగి రాక

హైదరాబాద్, మేజర్‌న్యూస్ : రాష్ట్రంలోని వాస్తవ పరిస్థితిని శ్రీకృష్ణ కమిటీకి తెలియజేస్తానని పీసీసీ అధ్యక్షుడు డి.శ్రీనివాస్ వెల్లడించారు. పార్టీ అధినేత్రి సోనియాగాంధీతో విడిగా సమావేశమయ్యే అవకాశం లభిస్తే రాష్ట్రానికి సంబంధించిన వివిధ అంశాలపై తప్ప కుండా మాట్లాడుతానని ఆయన చెప్పారు. శాసన సభలో సీఎం పేషీ వద్ద మంగళవారం డీఎస్ మీడియా ప్రతి నిధులతో మాట్లాడారు. ఈ నెల 11, 12 తేదీల్లో జరగను న్న పీసీసీ అధ్యక్షుల సమావేశంలో పాల్గొనేందుకు ఢిల్లీకి సాయంత్రం బయలుదేరి వెళ్లారు.

**25 లక్షల సభ్యత్వం..**

ఇప్పటివరకు రాష్ట్రంలో దాదాపు 25 లక్షల పార్టీ సభ్యత్వం నమోదైనట్లు డీఎస్ తెలిపారు. రాష్ట్రంలో గత ఆగస్టు నుంచి వరుసగా వచ్చిన సమస్యలు, ఆటంకాలతో సభ్యత్వం ఈ స్థాయికి కూడా చేరడం కష్టమని భావించినా నేతలతో సమీక్షలు జరిపి ఒత్తిడి తేవడం వల్లే 25 లక్షలకు చేరుకుందన్నారు. రాష్ట్రం నుంచి 50 లక్షల సభ్యత్వం నమోదు చేయడమే లక్ష్యమని గతంలో డీఎస్ చేసిన వాఖ్య లను గుర్తు చేయగా, సభ్యత్వం బాగా జరగాలంటే అలా చెప్పుకోక తప్పదని అన్నారు. కొన్ని అసెంబ్లీ నియోజక వర్గాల్లో సభ్యత్వం నమోదు కాలేదని ఒక ప్రశ్నకు సమాధా నంగా చెప్పారు. అంతకు ముందు ఆయన సీఎం చాంబర్ వద్ద కనిపించిన మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన మాజీ ఎమ్మెల్యేలు స్వర్ణ సుధాకర్, వంశీ మోహన్, మల్లు రవి తదితరులతో ముచ్చటించారు. నియోజకవర్గాల్లో పార్టీ సభ్యత్వంపై వారిని అడిగి తెలుసుకున్నారు.

**పీసీసీ అధ్యక్షుడిగా వాస్తవాలు నివేదిస్తా..**

శ్రీకృష్ణ కమిటీకి పార్టీ పరంగా సమర్పించే నివేదికలో పీసీసీ అధ్యక్షుడిగా తాను రాష్ట్రం లోని వాస్తవ పరిస్థితులను వివరిస్తానని డీఎస్ చెప్పారు. పీసీసీ చీఫ్‌గా తాను కమిటీకి ఒక నివేదిక ఇస్తానని, పార్టీ వైపు నుంచి ఎవరెన్ని నివేదికలు ఇచ్చుకున్నా తాను సమ ర్పించే నివేదికకు ప్రాధాన్యత ఉంటుందన్నారు. శ్రీకృష్ణ కమిటీ పార్టీ ఎన్నికల మ్యానిఫెస్టోను కూడా తెప్పించుకుని అందులో పార్టీ వైపు నుంచి చేసిన హామీలను సైతం పరిశీలించే అవకాశాలుంటాయన్నారు. ఉస్మానియా యూనివర్సిటీలో తాజాగా సాయికు మార్ అనే విద్యార్థి తెలంగాణ కోసం ఆత్మహత్య చేసుకున్న వార్త తెలుసుకుని డీఎస్ విచారం వ్యక్తం చేశారు.

నాలుగు రోజుల పర్యటన నిమిత్తం పీసీసీ అధ్యక్షుడు మంగళవారం సాయంత్రం ఢిల్లీకి బయలుదేరి వెళ్ళారు. తిరిగి 13న హైదరాబాద్ చేరుకుంటారు. ఢిల్లీ పర్యటన సందర్భంగా 11, 12 తేదీల్లో పీసీసీ అధ్యక్షులతో ఆస్కార్ ఫెర్నాండెజ్, సోనియాగాంధీ నిర్వహించే సమావేశాల్లో ఆయన పాల్గొంటారు.

పార్టీ రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జీ వీరప్ప మొయిలీ, ప్రణబ్‌ముఖర్జీలను కూడా డీఎస్ కలిసే అవకాశాలున్నట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. శ్రీకృష్ణ కమిటీకి పార్టీ పరంగా సమర్పించే నివేదిక, రాష్ట్రంలో ఉపఎన్నికలకు సంబంధించి ఢిల్లీ పెద్దలతో చర్చించే అవకాశాలున్నట్లు తెలుస్తోంది. ఢిల్లీ వెళ్ళడానికి ముందు మంగళవారం అసెంబ్లీలోని సీఎం చాంబర్‌లో ముఖ్యమంత్రి రోశయ్యతో సమావేశమై సుమారు అర గంటకు పైగా చర్చించారు. పార్టీ హైకమాండ్ దృష్టికి తీసు కెళ్లాల్సిన వివిధ అంశాలపై వీరిద్దరు మాట్లాడుకున్నట్లు పార్టీ వర్గాల సమాచారం.

## ఇక సొంతంగానే ఉద్యమాలు

- పరిధిదాటి మాట్లాడుతున్న 'దాడి'
- విద్యార్థుల బలిదానాలకు కాంగ్రెసే బాధ్యత వహించాలి
- శ్రీకృష్ణ కమిటీకి తెలంగాణ ఫోరం తరపున నివేదిక
- తెలంగాణ టీడీపీ నేతల వ్యాఖ్యలు

హైదరాబాద్, మేజర్‌న్యూస్: రాజకీయ జేఏసీలో కొనసాగుతూనే తెలంగాణా సాధన కోసం పార్టీ తరపున సొంతంగా ఉద్యమాలు చేస్తామని తెలంగాణ ప్రాంత టీడీపీ నేతలు వ్యాఖ్యానించారు. పార్టీ నేతలు డాక్టర్ నాగం జనార్ధనరెడ్డి, వేణుగోపాలాచారి, పోచారం శ్రీనివాసరెడ్డి తదితరుల మంగళవారం టీడీఎల్పీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తెలంగాణా జేఏసీ నుండి టీడీపీ బయటికి వస్తుందా? అన్న విలేకరుల ప్రశ్నకు నాగం జనార్ధనరెడ్డి బదులిస్తూ జేఏసీ సమావేశంలో అన్ని విషయాలు చర్చించుకుంటామని, ఆ తర్వాత పార్టీలోనూ మాట్లాడాకే ఏదైనా చెబుతామన్నారు. అయితే కన్వీనర్ కోదండరామ్ వ్యవహారశైలిపై నాగం ఆగ్రహం వ్యక్తం చేశారు. జేఏసీ నిర్ణయాలను మీడి యాకు వెల్లడించేందుకు మాత్రమే పరిమితమవుతారని చెప్పారని, ఇప్పుడు మా నాయకుణ్ణి దూషించే వరకు వచ్చారని, ఆ అధికారం ఆయనకు ఎవరిచ్చారని నాగం ప్రశ్నించారు. ఇలాంటి చర్యలను తమ పార్టీ సహించదని ఆయన ఖండించారు. చంద్రబాబు ఏం చేశారు? ప్రణబ్ కమిటీకి ఇచ్చిన లేఖను వెనక్కి తీసుకున్నారా? ప్రజల మనోభావాల మేరకు నడుచుకోవాలని స్వేచ్ఛ ఇచ్చారు కదా! అని నాగం వ్యాఖ్యానించారు. కాగా ఉస్మానియా వర్సిటీలో మంగళవారం బిటెక్ విద్యార్థి సాయికుమార్ ఆత్మహత్యకు పాల్పడడం పట్ల నాగం దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. విద్యార్థులు ఆత్మహత్యలకు పాల్పడవద్దని, బతికి ఉండి రాష్ట్రాన్ని సాకారం చేసుకుందామని ఆయన పిలుపు నిచ్చారు. విద్యార్థుల బలిదానాలకు కాంగ్రెస్ పార్టీదే పూర్తి బాధ్యత అని ఆరోపించారు. కాంగ్రెస్‌పార్టీలో చర్చించుకోకుండా ఏ ప్రాంతం వారిని ఒప్పించకుండా హడావుడిగా తెలంగాణాపై నిర్ణయాన్ని ప్రకటించారని, ఇప్పుడు పూటకోమాట మాట్లాడుతూ మాట మారుస్తున్నందుకే విద్యార్థుల్లో ప్రత్యేక రాష్ట్ర కాంక్షపై సందేహాలు వ్యక్తం అవుతున్నాయన్నారు. టీడీపీ తెలంగాణా ఫోరం తరపున శ్రీకృష్ణ కమిటీకి ఇచ్చేందుకు ఒక నివేదికను రూపొందిస్తున్నామని, ఇందులో అన్ని విషయాలను చేరుస్తామన్నారు.

## కరెంటు కోతలపై

# ఉద్యమాలు తీవ్రం చేస్తాం

- విద్యుత్ సౌధ ఎదుట పీఆర్పీ ధర్నా
- కరెంట్ ఆగి లిఫ్ట్‌లో ఇరుక్కున్న చిరంజీవి



విద్యుత్ సౌధ వద్ద ధర్నా చేస్తున్న పీఆర్పీ అధినేత చిరంజీవి

హైదరాబాద్, మేజర్‌న్యూస్ : రాష్ట్రంలో విద్యుత్ సమస్యలను పరిష్కరిం చాలని డిమాండ్ చేస్తూ ప్రజారాజ్యం పార్టీ మంగళవారం విద్యుత్‌సౌధ ముందు ధర్నా నిర్వహించింది. పార్టీ అధినేత చిరంజీవితోపాటు పలువురు ఎమ్మెల్యేలు , పార్టీ కార్యకర్తలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. పోలీసులకు కార్యకర్తలకు ఈ సందర్భంగా కొద్దిసేపు తోపులాట జరిగింది. గేట్లు తోసుకుని విద్యుత్ సౌధలోకి ప్రవేశించాలని ప్రయత్నించిన పలువురు కార్యకర్తలను పోలీసులు అరెస్ట్ చేయటం పట్ల చిరంజీవి ఆగ్రహం వ్యక్తంచేశారు. ప్రజాసమస్యలను శాంతియుతంగా ప్రభుత్వ దృష్టికి తీసుకుపోతున్న తమపై పోలీసులు రెచ్చగొట్టే ధోరణితో ప్రవర్తిస్తున్నారన్నారు. ఇలాగే ప్రవర్తిస్తే ఉద్యమాన్ని మరింత తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. పోలీసులు విచక్షణ మరిచి పోయి మీడియాపై కూడా దురుసుగా ప్రవర్తించాటాన్ని తీవ్రంగా ఖండించారు. ఒక దినపత్రిక ఫోటో గ్రాఫర్‌పై పోలీసు అధికారి ఒకరు పిడిగుద్దులతో విరుచుకుపడటం, మరో వీడియోగ్రాఫర్ మైక్‌లాగి దూరంగా విసిరి వేయటం వంటి సంఘటనలతో పోలీసులు మరోసారి తమ కర్కశత్వాన్ని ప్రదర్శించారు.

**ఏడు గంటలైనా ఇవ్వండి..సీఎండికి 'చిరు'వినతి**

రాష్ట్రంలో వ్యవసాయరంగానికి కనీసం ఏడుగంటలైనా నిరంతరంగా కరెంటు సరఫరా చేయాలని పీఆర్పి అధినేత చిరంజీవి విజ్ఞప్తి చేశారు. ధర్నా అనంతరం చిరంజీవి ట్రాన్స్‌కో సీఎండి అజయ్‌జైన్‌ను కలిసి వినతి పత్రం సమర్పించారు. ఇళ్ళకు విద్యాసంస్థలు, ఆస్పత్రులకు కోత పెట్టరాదని కోరారు.

**లిఫ్ట్‌లో ఇరుక్కున్న చిరంజీవి**

విద్యుత్ సమస్యలపై వినతి పత్రం ఇచ్చేందుకు విద్యుత్‌సౌధలోకి వెళ్ళిన చిరంజీవి తిరిగి వస్తుండగా లిఫ్ట్‌లో ఇరుక్కుపోయారు. సుమారు పది నిమిషాలు పైగానే లిఫ్ట్‌లో చిక్కుకుపోయారు. ఆయనతో పాటు పార్టీఅధికార ప్రతినిధి పద్మ తదితరులు లిఫ్ట్‌లో ఉన్నారు. కరెంట్ కోతపై ధర్నా చేసేందుకు వచ్చిన రాజకీయపార్టీనేత కరెంట్ కోతతో లిఫ్ట్‌లో చిక్కుకు పోవటంపై ఆందో ళనలు వక్తమయ్యాయి. తెలంగాణకు వ్యతిరేకంగా ఉన్నారంటూ విద్యుత్ సౌధలోని తెలంగాణ ప్రాంత ఉద్యోగులు కొందరు అప్పటికే చిరంజీవికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ వచ్చారు. చిరంజీవి లిఫ్ట్‌లోకి ఎక్కగానే కరెంట్ నిలిచిపోవటం వెనుక వారిపనే అయి ఉంటుందన్న సందేహాలు కూడా వ్యక్తమయ్యాయి. ప్రజారాజ్యం ధర్నాలో చిరంజీవితో పాటు ఎమ్మెల్యేలు వంగాగీత, ఈలి నాని, కన్నబాబు, శ్రీధర కృష్ణారెడ్డి, గంటాశ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

**టీడీపీ, మిత్రపక్షాల ధర్నా**

రాష్ట్రంలో రోజు రోజుకీ పెరిగిపోతున్న విద్యుత్ కోతలకు వ్యతిరేకంగా తెలుగుదేశం, ఉభయ కమ్యూనిస్టు పార్టీలు హైదరాబాద్ గన్‌పార్కు వద్ద ధర్నా నిర్వహించాయి. ఈ కార్యక్రమానికి నాయకత్వం వహించిన ప్రతిపక్ష నేత చంద్రబాబు నాయుడు విద్యుత్ కొరతను తీర్చడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని విమర్శించారు. ప్రభుత్వానికి ముందు చూపు లేకపోవడం వల్లనే రైతులు, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని ఆయన అన్నారు. సీపీఎం శాసనసభా పక్ష నేత జూలకంటి రంగారెడ్డి, సీపీఐ పక్ష నేత మల్లేష్ మూడు పార్టీలకు చెందిన శాసనసభ్యులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# పట్టాభిషేకం

(మొదటి పేజీ తరువాయి)

పొందితే లోక్‌సభలో మొత్తం 543 సీట్లకు గాను 181 సీట్లు మహిళలకు రిజర్వు చేయబడతాయి. 28 రాష్ట్రాల శాసనసభల్లో మొత్తం 4,109 సీట్లలో 1,370 మంది మహిళలకు సీట్లు లభిస్తాయి. బిల్లు చట్టంగా మారితే 15 సంవత్సరాల వరకు రిజర్వేషన్లు రొటేషన్ పద్ధతిలో అమలవుతాయి. యూపీఏ ప్రభుత్వ భాగస్వామి తృణ మూల్ కాంగ్రెస్‌కు రాజ్యసభలో రెండు సీట్లున్నాయి. మంగళవారం వీరు ఓటింగ్‌కు దూరంగా ఉన్నారు. 15 మంది సభ్యులున్న బీఎస్పీ యధావిధిగా బిల్లును వ్యతి రేకించింది. ఓటింగ్‌కు ముందే బీఎస్పీ వాకౌట్ చేసింది. ప్రధానమంత్రి మన్మోహన్‌సింగ్ చర్చల్లో పాల్గొంటూ మహిళ సాధికారతకు నేటి సంఘటనను చారిత్రాత్మక ఘట్టమని ప్రధాని అభివర్ణించారు. ఈ బిల్లు మైనారిటీలకు కానీ, ఎస్‌సీ/ఎస్‌టీలకుగానీ వ్యతిరేకం కాదని, మహిళలకు దాస్య విముక్తి కలిగించేందుకని ఆయన అన్నారు. ఎస్పీ, ఆర్‌జెడీలు బిల్లును తీవ్రంగా వ్యతిరేకిస్తూ వచ్చాయి. ముస్లిం మహిళలకు, ఓబీసీలకు, దళిత మహిళలకు అన్యా యం జరుగుతోందని వ్యతిరేకించాయి.

ఇక లోక్‌సభలో ఈ బిల్లును ఆమోదమే మిగిలింది. లోక్‌సభలో బీజేపీ, లెఫ్ట్, మరికొన్ని చిన్న పార్టీల మద్దతుతో గట్టెక్కాలి. ఇక్కడా ఎస్పీ, ఆర్‌జెడీ, జెడీయులో బిల్లును వ్యతిరేకిస్తాయి. కాంగ్రెస్ అధ్యక్షురాలు సోనియా గాంధీ పట్టుబట్టడం వల్లనే ప్రభుత్వం రాజ్యసభలో బిల్లును ప్రవేశపెట్టింది. రాజ్యసభలో బిల్లు ఆమోదం పొందాక సోనియాగాంధీ తేలిగ్గా ఊపిరి పీల్చుకున్నారు. మహిళా సాధికారికత కోసం ప్రభుత్వం పెద్ద రిస్కే తీసుకుందని సోనియాగాంధీ చెప్పారు. రాజ్యసభలో జరిగిన చర్చలు, సభ్యుల గందరగోళాన్ని తాను టీవీలో చూచి ఆందోళన చెందానని అన్నారు. బిల్లుపై వ్యతిరేక, అనుకూల వాదనలు పరిగణనలోకి తీసుకున్న తర్వాతనే ఈ బిల్లుకు రాజ్యసభలో ప్రవేశపెట్టాలని నిర్ణయించుకున్నామని ఆమె చెప్పారు. జెడీ(యు)కి చెందిన శరద్‌యాదవ్ బిల్లును వ్యతిరేకించగా, నితిష్‌కుమార్ బిల్లుకు అనుకూలమని ప్రకటించారు. లెఫ్ట్ పార్టీలకు అత్యధిక ప్రాధాన్యం ఇచ్చి, తమను పట్టించుకోవడం లేదని తృణమూల్ కాంగ్రెస్ పార్టీ ఓటింగ్‌కు దూరంగా ఉంది. ప్రధానమంత్రి మన్మోహన్‌సింగ్ మంగళవారం అఖిలపక్ష సమావేశాన్ని ఏర్పాటు చేస్తామని సోమవారం చెప్పారు. ఈ విషయాన్ని కూడా తమకు చెప్పలేదని మమతా బెనర్జీ గరంగరంగా ఉన్నారు. సీపీఐ(ఎం)కు చెందిన బృందాకరత్‌ను విశ్వాసంలోకి తీసుకున్నారు కానీ, తమను మరచిపోయారని మమతా బెనర్జీ ఆగ్రహంగా ఉన్నారు. తృణమూల్, లాలూయాదవ్ పార్టీలు ప్రభుత్వానికి మద్దతిచ్చేపార్టీలే కదా ప్రజాస్వామ్యాన్ని పరిహాసం చేస్తే తాము ఒప్పుకోమని మమతా బెనర్జీ పత్రికల వారి ముందు అక్కసు వెళ్లగక్కారు.

ఈ బిల్లు వచ్చే సంవత్సరం జరిగే పశ్చిమ బెంగాల్ ఎన్నికల్లో మైనారిటీలపై ప్రభావం చూపుతుందని మమతా భావిస్తున్నారు. రాజ్యసభలో ఎస్పీ, ఆర్‌జెడీ, జెడీయుకు చెందిన మొత్తం ఏడుగురు సభ్యులను బడ్జెట్ సమావేశాలయ్యే వరకు రాజ్యసభ చైర్మన్ హమీద్ అన్సారీ బహిష్కరించారు. మార్షల్స్ బలవంతంగా వారిని సభ నుంచి బయటకు తీసుకువెళ్లిన తర్వాత బిల్లుపై చర్చ జరిగింది. బీజేపీ, లెఫ్ట్ పార్టీలు బిల్లుకు మద్దతు తెలిపాయి.

## బీటీ పత్తి విత్తనాల రేటును పెంచే ప్రతిపాదనలేదు





హైదరాబాద్, మేజర్‌న్యూస్ : బిటి కాటన్ విత్తనాల ధర పెంచే ప్రసక్తే లేదని, ధర పెంచేందుకు తాము అనుమతివ్వబోమని ముఖ్యమంత్రి రోశయ్య మంత్రులు కోమటిరెడ్డి, శ్రీధర్‌బాబులకు స్పష్టం చేశారు. బిటి కాటన్ విత్తనాల ధర పెంపు కోసం ప్రభుత్వ అనుమతి కోరుతూ నేషనల్ సీడ్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా సిఎంకు వినతి పత్రం సమర్పించడం, కొన్ని పత్రికల్లో ప్రకటనలు ఇచ్చిన నేపథ్యంలో కోమటిరెడ్డి, శ్రీధర్‌బాబు మంగళవారం సిఎంను కలిసి కాటన్ విత్తనాల ధరలు పెంచవద్దని, ధరలు పెంచడం వల్ల రైతులు నష్టపోతారని విజ్ఞప్తి చేశారు. ఇందుకు సీఎం స్పందిస్తూ నేషనల్ సీడ్స్ అసోసియేషన్ నుంచి తనకు వినతి పత్రం వచ్చిన మాట వాస్తవమేనని, అయితే కాటన్ విత్తనాల ధరలు పెంచేందుకు తాము ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతివ్వబోమని స్పష్టం చేశారు.

## డిగ్రీలో 50 శాతం ఉంటేనే బీఎడ్‌లో ప్రవేశాలు

హైదరాబాద్, మేజర్‌న్యూస్: బ్యాచిలర్ ఆఫ్ ఎడ్యుకేషన్ (బిఎడ్)లో కాలేజీలలో సీటు పొందాలంటే అందుకు సంబంధించిన డిగ్రీ కోర్సులో 45 శాతం నుంచి 50 శాతం మార్కులు కచ్చితంగా పొంది ఉండాలి. ఆ విధంగా విద్యార్హతలలో నిబంధనలు మాధ్యమిక విద్యా శాఖ విధించింది. ఆ మేరకు మంగళవారం మాధ్యమిక విద్యా శాఖ కార్యదర్శి సాంబశివరావు ఉత్తర్వులు జారీ చేశారు. దీని ప్రకారం బ్యాచిలర్ డిగ్రీకి సంబంధించి బిఎ/ బిఎస్సీ/ బికాం/ బిఎస్సీ హోంసైన్స్/ బిసిఎ/ బిబిఎం, లేదా పోస్టు గ్రాడ్యుయేషన్ లేదా తత్సామాన అర్హతలులో కూడా 50 శాతం మార్కులు పొంది ఉండాలని విడుదల చేసిన జీవోలో పొందుపరిచారు. అయితే ఎన్‌సిటిఈ నిబంధనల ప్రకారం రాష్ట్ర ప్రభుత్వ విషయాలను పరిగణనలోకి తీసుకొన్నట్లు జీవోలో పేర్కొన్నారు.

## ఎస్‌జీటీల భర్తీపై కదలని విద్యా శాఖ

హైదరాబాద్, మేజర్‌న్యూస్: పాఠశాల విద్యా శాఖకు సంబంధించిన డిఎస్సీ-2008 నోటిఫికేషన్‌లో ప్రకటించిన ఎస్‌జీటీ పోస్టులు భర్తీ చేయడానికి పాఠశాల విద్యా శాఖ అధికార యంత్రాంగం ఏ మాత్రం కదల్లేదు. 33 వేల ఎస్‌జీటీ పోస్టులు భర్తీ చేస్తామని పేర్కొన్నప్పటికీ వాటిని భర్తీ చేయక పోవడం వల్ల టీచర్ ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులంతా దుఃఖ:సాగరంలో మునిగిపోతున్నారు. కాని ప్రభుత్వానికి, అధికార యంత్రాంగానికి మాత్రం ఈ విషయంలో ఛీమ కుట్టినట్లుగా కూడా లేకుండా పోయింది. ప్రత్యామ్నయ మార్గాల అన్వేషించి ఎస్‌జీటీలను భర్తీ చేయాలని ఎంతగా చెబుతున్నప్పటికీ అధికారులు మాత్రం పెడచెవిన పెట్టడం నిరుద్యోగ లోకాన్ని కలవర పాటుకు గురి చేస్తోంది. ఈ విషయంలో మంత్రి మాణిక్య వర ప్రసాదరావు ఎంతగా ముందు చూపుతో ఉన్నప్పటికీ ఆ మేరకు అధికారులు సహకరించక పోవడం విడ్డూరంగా ఉంది.

## డోలమైట్ కార్మికుల సమస్యలు పరిష్కరించండి



హైదరాబాద్, మేజర్‌న్యూస్ : ఖమ్మం జిల్లా మాధారం డోలమైట్ కర్మాగారానికి సంబంధించిన ఉద్యోగుల, నిర్వాసితుల సమస్యలను పరిష్కరించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి నారాయణ మంగళవారం ముఖ్యమంత్రి రోశయ్యకు ఓ లేఖ రాశారు. కాంట్రాక్టు కార్మికుల వేతనా లను పెంచాలని, వారి సర్వీసులను రెగ్యులరైజ్ చేయాలని, మిగిలిన నిర్వాసితులను వెంటనే ఉద్యోగాల్లోకి తీసుకోవాలని కోరారు. బ్లాస్టింగ్ వల్ల నష్టపోయిన వారికి నష్టపరిహారం చెల్లించాలని, భూములు కోల్పయిన వారందరికీ ప్రస్తుత రేటు ప్రకారం డబ్బు చెల్లించాలని సీఎంకు విజ్ఞప్తి చేశారు.

## విద్యార్థులూ... ఆత్మహత్యలు వద్దు



హైదరాబాద్, మేజర్‌న్యూస్ : తెలంగాణ కోసం ఉస్మా నియా యూనివర్సిటీలో తాజాగా నల్గొండ జిల్లా కోదాడకు చెందిన సాయికుమార్ అనే విద్యార్థి ఆత్మహత్య చేసుకో వడం దురదృష్టకరమని తెలంగాణ కాంగ్రెస్ సారథ్య బృం దం విచారం వ్యక్తం చేసింది. విద్యార్థులు ఆత్మహత్య లకు పాల్పడొద్దని సారథ్య బృందం నేతలు జి.నిరంజన్, లక్ష్మినారాయణ, రజనిరెడ్డి మంగళ వారం విజ్ఞప్తి చేశారు. ఏకాభిప్రాయం లేకున్నా మహిళా బిల్లు వచ్చి నట్లే తెలం గాణ బిల్లు కూడా వస్తుందని, పార్టీ అధినేత్రి సోనియాగాంధీ ఇచ్చిన మాట తప్పరని, తప్పకుండా తెలంగాణ ఇస్తారని వారు అన్నారు. తెలంగాణ విషయంలో అధైర్యపడొద్దని వారు విద్యార్థులకు విన్నవించుకున్నారు.

## సీఎం, బాబులను కలిసిన సురేంద్ర



సీఎంకు కృతజ్ఞతలు చెబుతున్న సురేంద్ర

రాష్ట్ర ప్రెస్ అకాడమీ ఛైర్మన్‌గా నియమితులైన సీనియర్ పాత్రికేయుడు తిరుమలగిరి సురేంద్ర మంగళవారం శాసన సభలో సీఎం చాంబర్‌లో రోశయ్యను మర్యాద పూర్వకంగా కలిశారు. తనను ప్రెస్ అకాడమీ ఛైర్మన్‌గా నియమించినందుకు ఆయన ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. సీఎం కూడా సురేంద్రను అభినందించారు. ఆ తరువాత సురేంద్ర అసెంబ్లీ లోని ప్రతిపక్ష నేత చంద్రబాబు చాంబర్‌కు వెళ్ళి ఆయన్ని కలిశారు. బాబు కూడా ఈ సందర్భంగా సురేంద్రను అభినందించారు. అనంతరం సురేంద్ర రాష్ట్ర సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి జె.గీతారెడ్డిని కలిసి కృతజ్ఞత లు తెలిపారు. ఈ సందర్భంగా సురేంద్ర మాట్లాడుతూ జర్నలిస్టుల వృత్తి నైపుణ్యాన్ని పెంపొందించేందుకు కృషి చేస్తానని అన్నారు.

## నెలరోజుల సెలవులో నగర జేసీ ?

హైదరాబాద్, మేజర్‌న్యూస్ : నగర సంయుక్త కమిషనర్‌గా ఇటీవలే బాధ్యతలు చేపట్టిన పి.సీతా రామాంజనేయులు నెల రోజులు సెలవు పెట్టినట్లు తెలుస్తున్నది. రెండు నెలల క్రితం బాధ్యతలను స్వీకరించిన ఆంజనేయులుపై ఉస్మానియా యూనివర్శిటీలో విద్యార్థులు, మీడియాపై దాడి ఘటనలో రాష్ట్ర సర్వోన్నత న్యాయస్థానం తీవ్రంగానే హెచ్చరికలు జారీచేసింది. ఈ నేపథ్యంలో సంయుక్త కమిషనర్‌గా పనిచేస్తున్నప్పటికీ, విచారణ ముగిసే వరకు ఉస్మానియా యూనవిర్శిటీ లోపలకు వెళ్ళరాదని ఆదేశాలు జారీచేసిన నేపథ్యంలో సెలవు పెట్టినట్లు తెలుస్తున్నది. ఈయన స్థానంలో డాక్టర్ ఆర్.ఎస్.ప్రవీణ్‌కుమార్‌ను నియమించే అవకాశాలు ఉన్నట్లు సమాచారం.

# విదేశీ సంబంధమా వద్దుబాబోయ్!

- ఎన్ఆర్ఐ మోసాలకు చెక్ పెడుతున్న పోలీసులు
- మోసం చేసిన వారికి రెడ్‌కార్నర్ నోటీసులు
- పెళ్ళికి ముందే తగు జాగ్రత్తలు తీసుకోండి: పోలీసులు

హైదరాబాద్, మేజర్‌న్యూస్: సప్తపదితో విదేశీ వరులను పెళ్ళాడి... విదేశాల్లో జీవించాలనేది ప్రతి అమ్మాయి కోరు కునే కల...అయితే విదేశీ మోజుతో చివరకు లక్షలు, కోట్లాది రూపాయల వరకట్నం ఇచ్చి తమ కూతురును కంటి రెప్పలా కాపాడుతాడనీ... విదేశాల్లో ఆనందంగా చూసుకుంటాడని పెళ్ళిళ్ళు చేస్తుండగా... చివరకు అవి అదనపు కట్నం... వేధింపులతో పలువురు అమ్మాయిల జీవితం ఆదిలోనే అంతరించిపోతోంది. మరికొందరు ధైర్యం చేసి ఫిర్యాదులు చేస్తున్నా... ఇంకా కొందరు పరువు- ప్రతిష్ట పేరుతో లోలోపలే కుమిలిపోతూ చిన్న పాటి ఉద్యోగం చేసుకుంటూ జీవితాన్ని సాగిస్తున్నారు. విదేశీ మోజుపై అమ్మాయిల తల్లిదండ్రుల తొందరపాటు విదేశీ అబ్బాయిలకు లక్షలు ఆర్జించే వ్యాపారంగా మారడంతో ఇటీవలి కాలంలో విదేశాల్లో ఉద్యోగం పేరుతో మోసాలు ఎక్కువయ్యాయి. ఈ నేపథ్యంలో విదేశీ మోసాలకు పాల్పడుతున్న వారిపై పోలీసులు రెడ్‌కార్నర్ నోటీసులు జారీచేస్తున్నారు.

విదేశాల్లో ఉద్యోగాలు చేసే అల్లుళ్ళపై ఎవరికైనా మోజు ఉంటుంది. ఎన్ఆర్ఐల పేరుతో రాష్ట్రానికి చెందిన పలువురు యువతులను పెళ్ళిళ్ళు చేసుకుని మోసం చేస్తున్న సంఘటనలు అమ్మాయిల తల్లిదండ్రులను తీవ్ర భయాందోళనలకు గురిచేస్తున్నాయి. అయితే చట్ట పరంగా... సమాజపరంగా చర్యలు తీసుకునేందుకు విదేశాలకు సంబంధించిన అంశం కావడంవల్ల నెలలు... సంవత్సరాల కాలం దాటినా నిందితులకు శిక్ష పడక పోగా, మరో అమ్మాయికి వలవేసి పెళ్ళిళ్ళు చేసుకుంటున్న ఎన్ఆర్ఐ ఘరానా మోసగాళ్ళ కోసం పోలీసులు రెడ్‌కార్నర్ నోటీస్ (ఇంటర్‌పోల్) సహకారాన్ని తీసుకుం టున్నారు. ఇటీవల రాష్ట్రానికి చెందిన మహిళా మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు అసెంబ్లీ సమావేశం సందర్భంగా కమిటీ హాల్‌లో సమావేశం నిర్వహించారు. ఎన్ఆర్ఐ మోసాలకు గురవుతూ జీవితాలు అంధకారమవుతు న్నాయనీ, విదేశీ అల్లుళ్ళ మోజులో లక్షలాది రూపాయల వరకట్నం ధారపోస్తూ వారి జీవితాలను అంధకారం చేసు కుంటున్న సంఘటనలపై కఠిన చర్యలు తీసుకోవాలని మహిళా ప్రజా ప్రతినిధులు సైతం ముక్తకంఠంతో స్పష్టం చేశారు.

**విదేశాల్లో సెక్షన్లు పనిచేయవు**

విదేశాల్లో 498ఏ అదనపు కట్నం కోసం వేధించే కేసులు ఉండవనీ, వరకట్న దురాచారం ఇతర దేశాల్లో లేదని కేవలం భారతదేశంలో మాత్రమే ఈ తతంగం ఇంకా కొనసాగుతుందని పోలీసు ఉన్నతాధికారులు చెబుతున్నారు. దీనివల్ల ఎన్ఆర్ఐ భర్తల కోసం 498ఏ ఐపీసీ సెక్షన్‌తో పాటు 406 చట్టం దుర్వినియోగం, 420 ఛీటింగ్ కేసులు ఆ దేశాల్లో దేశ బహిష్కరణ కిందకు వస్తున్నందున ఈ చట్టాలను పెట్టి రెడ్‌కార్నల్ నోటీస్ ఇంటర్‌పోల్ ద్వారా అందించేందుకు సీఐడీ విభాగం రంగం సిద్ధం చేసింది. దీనిద్వారా రెడ్‌కార్నర్ నోటీసు జారీ చేసిన సదరు ఎన్ఆర్ఐ ఏ విమానాశ్రయంలో ప్రయా ణించినా వెంటనే పట్టుకుని అరెస్టు చేసే అవకాశాలు ఉన్నట్లు పోలీసు అధికారులు చెబుతున్నారు. గడచిన మూడు సంవత్సరాలుగా 236 ఎన్ఆర్ఐలకు సంబంధిం చిన వారంట్లు పెండింగ్‌లో ఉన్నాయనీ, 87 మంది ఎన్ఆర్ఐ భర్తలకు రెడ్‌కార్నర్ నోటీసులు జారీచేయడం జరిగిందని పోలీసు ఉన్నతాధికారులు చెబుతున్నారు.

**విదేశీ సంబంధాలపై అప్రమత్తంగా ఉండండి: పోలీసులు**

- విదేశీ వరుడికి సంబంధించి ఇంటి చిరునామా, కార్యాలయం చిరునామా తప్పనిసరిగా తీసుకోవాలి.
- అదే విధంగా ఈ మెయిల్ చిరునామాతో పాటు వరుడి అత్యంత సన్నిహితులైన ఇద్దరు స్నేహితుల చిరునామాలు, పాస్‌పోర్టు జిరాక్స్ ప్రతిని తీసుకోవాలి.
- వీసా అప్లికేషన్‌లో భార్య పేరు జతచేయడంతో పాటు పాస్‌పోర్టులో తండ్రి పేరు బదులు అమ్మాయి భర్త పేరు పెట్టాలి, పెళ్ళి చేసినా చట్టపరం చేయడం కోసం రిజిస్టర్ మ్యారేజీ తప్పనిసరిగా చేయాలి.
- మొదటిసారి అమ్మాయిని పంపించేప్పుడు తోడు ఎవరైనా వెళ్ళాలి. తొందరగా పెళ్ళి చేయాలంటూ వత్తిడి తెచ్చే సంబంధాలపై ఆరా తీయాలి.

**ఆయా జిల్లాల్లో నమోదైన ఎన్ఆర్ఐ కేసులు**

| సంవత్సరం | రిజిస్టర్ అయిన కేసుల సంఖ్య | ఎన్‌బిడబ్ల్యూ పెండింగ్ | రెడ్‌కార్నర్ నోటీసులు జారీ |
|---|---|---|---|
| 2007 | 39 | 19 | 19 |
| 2008 | 42 | 23 | 18 |
| 2009 | 53 | 23 | 44 |
| మొత్తం | 134 | 65 | 41 |

కేవలం హైదరాబాద్‌లో 101 కేసులు నమోద య్యాయి. ఈ నేపథ్యంలో మొత్తం రాష్ట్రంలో 235 కేసులు రిజిస్టర్ అయ్యాయి. ఇందులో 130 ఎన్‌బిడబ్ల్యూలు ఇప్పటి వరకు పెండింగ్‌లో ఉన్నాయి.

## నేటి నుంచి ఇంటర్ పరీక్షలు

(మొదటి పేజీ తరువాయి)

2.00 నుంచి సాయంత్రం 5.00 గంటల వరకు నిర్వహించడానికి ప్రత్యేక షెడ్యూల్‌ను జారీ చేశారు. మిగతా తేదీలలో ఉదయం 8.00 నుంచి 11.00 గంటల వరకు పరీక్షలు జరుగుతాయి. పరీక్షలకు హాజరయ్యే విద్యా ర్థులకు తాగు నీరు, టాయిలెట్స్ సదుపాయం కల్పించాలని ప్రాంతీయ పర్యవేక్షణ అధికా రు(ఆర్ఐఓ)లకు బోర్డు అధికారులు సూచనలు పంపించారు.

**పరీక్షల కేంద్రాల వద్ద 144 సెక్షన్**

పరీక్షలు నిర్వహించే కేంద్రాల చుట్టు పక్కల కొంత మేరకు 144 సెక్షన్ అమ లులో ఉంటుంది. దాదాపు 20 నుంచి 30 కిలోమీటర్ల దూరం వెళ్లి పరీక్షలు రాయాల్సిన పరిస్థితులు ఉండడంతో ఆయా ప్రాంతాలకు బస్సులు నడపాలని ఆర్టీసీ అధికారులను ఇంటర్ మీడియట్ బోర్డు విజ్ఞప్తి చేసింది. హాల్ టిక్కెట్లు, నామినల్‌రోల్స్ పరీక్షాకేంద్రాలకు పంపించినట్లు అధికారులు తెలిపారు.

**15 నిమిషాలు ఆలస్యమయినా అనుమతిస్తాం**

పరీక్ష సమయానికి 15 నిమిషాలు ఆలస్యంగా వచ్చిన విద్యార్థులను అనుమ తించనున్నా రు. అది కూడా అనివార్య కారణాలు ఏర్పడినప్పుడు మాత్రమే ఆలస్యాన్ని పరిగణనలోకి తీసుకోనున్నారు. దీని వల్ల దూర ప్రాంతాల నుంచి వచ్చే విద్యార్థులకు కొంత వెసులుబాటు కలుగుతుందని బోర్డు అధికారులు భావించారు. కొన్ని పరీక్షా కేంద్రాలు దూరంగా ఉండడం వల్ల 200 సెల్ఫ్ సెంట ర్లను సైతం ఏర్పాటు చేశారు.